# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com   ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433   E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్   ఆదివారం 9-11-2025   NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001.   సంపుటి :32   సంచిక:73   పేజీలు:6   వెల: రూ.1/-


**నేటి కందం- నేటికి అందం**

వందాయాబది యేండ్లుగ
నందరి మానసము లందు నద్భుత గతిలో
"వందేమాతర గీతము"
సందడి చేయగ ప్రధాని జయఘోష నిడెన్ !!

("వందేమాతరం"గీతం 150 సంవత్సరపు ఉత్సవాలను ప్రధాని నరేంద్ర మోడి ప్రారంభించి, తపాలా బిళ్ళ ను, నాణెమును విడుదల చేసి భారతీయుల ఐక్యతను శ్లాఘించారు.)



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

ప్రభుత్వాలు మారినా
పాలనలో అవినీతి
అదేకదా రాజకీయ
ఆధునిక రాజనీతి
నిన్న వాళ్లు నేడు వీళ్లు
నిజాయితీగున్నదెవరు
ఏడ్పుగొట్టు విమర్శలు
ఎందుకింకాఒకరినొకరు



-వేల్పుల నారాయణ
9440433475

# ఘనంగా సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు ..






హైదరాబాద్, నవంబర్ 8: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఇవాళ (శనివారం) రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు వేడుకలు చేసుకుంటున్నారు. ఎక్కడికక్కడ కేక్‌లు కట్ చేస్తూ టపాసులు పేలుస్తూ శుభాకాంక్షలు చెబుతున్నారు. ఇప్పటికే పలువురు మంత్రులు, పార్టీల ముఖ్య నేతలు సహా సినీ, రాజకీయ రంగాల ప్రముఖులు రేవంత్ రెడ్డికి బర్త్ డే విషెల్ తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ముందు ముఖ్యమంత్రి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చిలుక మధుసూదన్ రెడ్డిఆధ్వర్యంలో ఈ వేడుకలు చేశారు. ఈ నందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. 'తెలంగాణలో ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందించిన ప్రజా ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారికి ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయి. అన్ని వర్గాల ఆశీస్సులు ఉన్న మన ముఖ్యమంత్రికి భగవంతుడు గట్టి బలం, సంకల్పం అందించాలి. ఈ రాష్ట్రానికి మరో 20 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా సేవ చేసే అవకాశం రేవంత్ రెడ్డికి ఇవ్వాలి' అని ఆకాంక్షించారు.

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని ఖైరతాబాద్‌లో వేడుకలు ఘనంగా జరిగాయి. ఎన్.టి.ఆర్ గార్డెన్స్ ఎదురుగా ఖైరతాబాద్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి, కార్పొరేటర్ పి. విజయ రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి సైకత శిల్పం ఏర్పాటు చేయడం జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. ఆయన పి. విజయ రెడ్డితో కలిసి కేక్ కట్ చేసి సీఎం రేవంత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా శిల్పి బాలాజీ రూపొందించిన సైకత శిల్పం ఆకర్షణగా నిలిచింది. కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను సందడిగా నిర్వహించారు.

మా కష్టాలను గుర్తించిన సీఎం - ప్రజా క్షేత్రంలో మరిన్ని జన్మదినాలు జరుపుకోవాలి..

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని, తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం ఫిల్మ్‌నగర్ చాంబర్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ప్రముఖ రచయిత పరుచూరి గోపాలకృష్ణ, ఫిల్మ్ ఫెడరేషన్ అధ్యక్షులు, చిత్రపురి అధ్యక్షులు వల్లభనేని అనిల్ కుమార్, ప్రొడక్షన్ మేనేజర్స్ యూనియన్ అధ్యక్షులు కానుమిల్లి అమ్మిరాజు, ఎంప్లాయీస్ ఫెడరేషన్ సెక్రటరీ జి. శ్రీకాంత్, సినీ టోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యుడు భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

"సినీ కార్మికుల కష్టాలను గుర్తించి, వారికి అండగా నిలిచిన సీఎం రేవంత్ రెడ్డి నిజమైన ప్రజానాయకుడు. ఆయన ప్రజా క్షేత్రంలో ఇంకా ఎన్నో జన్మదినోత్సవాలు జరుపుకుంటూ, రాష్ట్ర అభివృద్ధికి మార్గదర్శకుడిగా నిలవాలని ఆకాంక్షిస్తున్నాం" అని తెలిపారు.

కార్యక్రమంలో చిత్రపురి కాలనీ కమిటీ సభ్యులు బత్తుల రఘు, టీ. లలిత, సి. వేణుగోపాల్, డి. రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# డిసెంబర్ ఒకటి నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు

న్యూ ఢిల్లీ నవంబర్ 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );పార్లమెంట్ శీతాకాల సమావేశాలకు కేంద్రం సిద్ధమైంది. డిసెంబర్ ఒకటవ తేదీ నుంచి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. డిసెంబర్ 19 వరకూ ఈ సమావేశాలు కొనసాగనున్నాయి. పార్లమెంటు శీతాకాల సమావేశాలను నిర్వహించాలనే ప్రభుత్వ ప్రతిపాదనను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజుజు శనివారం ప్రకటించారు. 'పార్లమెంటరీ వ్యవహారాల అత్యవసర పరిస్థితులకు లోబడి డిసెంబర్ 1 నుంచి 19 వరకూ పార్లమెంటు శీతాకాల సమావేశాలను నిర్వహించాలనే ప్రభుత్వ ప్రతిపాదనను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు' అని ఎక్స్‌లో ట్వీట్ పెట్టారు.

# సిసిఐ సిఎండితో పత్తి కొనుగోళ్లపై మంత్రి తుమ్మల చర్చ

హైదరాబాద్ నవంబర్ 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: పత్తి కొనుగోళ్లపై సిసిఐ సిఎండి లలిత్‌కుమార్ గుప్తాతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఫోన్‌లో మాట్లాడారు. తెలంగాణలో పత్తి రైతులు పడుతున్న ఇబ్బందుల గురించి ఆయన లలిత్‌కుమార్‌కి ఫోన్‌లో వివరించారు. ఎకరానికి 7 క్వింటాళ్ల పత్తి కొనుగోలు పరిమితిపై చర్చించారు. ఆ నిబంధనను ఎత్తివేసి పాత విధానంలోనే సిసిఐ పత్తి కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కపాస్ కిసాన్ యాప్‌ను 24 గంటలు అందుబాటులో ఉంచాలని కోరారు. పత్తి మిల్లులన్నీ వెంటనే తెరిచేలా చర్యలు తీసుకోవాలని.. 20 శాతం తేమ ఉన్న పత్తిని సిసిఐ కొనేలా చర్యలు చేపట్టాని విజ్ఞప్తి చేశారు.

# ఢిల్లీలో అధ్వాన్నస్థితిలో వాయు కాలుష్యం.. శ్వాస తీసుకోవడంలో ప్రజల ఇబ్బందులు



న్యూఢిల్లీ, నవంబర్ 8: దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం కొనసాగుతోంది. గత కొన్ని రోజులుగా ఢిల్లీ-ఎన్సీఆర్‌లో గాలి నాణ్యత అధ్వాన స్థాయిలో నమోదవుతోన్న విషయం తెలిసిందే.

తాజాగా శనివారం ఉదయం కూడా ఢిల్లీలో కాలుష్యం వెరీ పూర్ కేటరిగీలో నమోదైంది.

సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రకారం.. శనివారం ఉదయం ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 355గా నమోదైంది. ఆనంద్ విహార్‌లో ఏక్యూఐ 332గా, అలీపూర్ వద్ద 316, అశోక్ విహార్‌లో 332, ఇండిగా గేట్ వద్ద ఏక్యూ 322గా, పాలెం ప్రాంతంలో 320, ధౌలా కువాన్‌లో 269, అశోక్ విహార్ ప్రాంతంలో 332, బవానా లో 366, బురారి క్రాసింగ్ వద్ద 345, ఛాందిని చౌక్ ప్రాంతంలో 354, ద్వారకా సెక్టార్-8లో 310, ఐటీఓ ప్రాంతంలో 337, జహంగీర్‌పురిలో 342, ముండ్కా ప్రాంతంలో 335, నరేలా వద్ద 335, ఓఖ్లా ఫేజ్-2లో 307, పట్పర్‌గంజ్ వద్ద 314, పంజాబీ బాగ్ 343, ఆర్‌కే పురంలో 321, రోహిణి ప్రాంతంలో 336, సోనియా విహార్ వద్ద 326గా ఏక్యూఐ వెరీ పూర్ కేటగిరీలో నమోదైంది.

కాలుష్య స్థాయిలు తీవ్రస్థాయిలో ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్వాస తీసుకోవడం కష్టతరంగా ఉందని స్థానిక నివాసి కరణ్ శర్మ అనే వ్యక్తి తెలిపారు. ఈ పరిస్థితి పరిష్కరించేందుకు ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. 'ఢిల్లీలో కాలుష్యం చాలా ఎక్కువగా ఉంది. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. సంబంధిత విభాగాలు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. ప్రభుత్వం ఈ సమస్యపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి' అని అతను కోరారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక.. సీపీ సజ్జనార్ కీలక ఆదేశాలు



హైదరాబాద్, నవంబర్ 8:జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక దృష్ట్యా హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ కీలక ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్, కౌంటింగ్ రోజున జూబ్లీహిల్స్ పరిధిలో ఆంక్షలు విధిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి ఈ నెల 11న సాయంత్రం 6 గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. ఈ నెల 14న ఉదయం 6 నుంచి ఉదయం 6 గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. నిర్దేశించిన సమయాల్లో మద్యం షాపులన్నీ మూసివేయాలని సీపీ ఆదేశించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో హోటల్స్, రెస్టారెంట్లు, క్లబ్బులు మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఉప ఎన్నిక పోలింగ్ రోజున, ఓట్ల లెక్కింపు రోజున 144 సెక్షన్ అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల నుంచి 200 మీటర్ల వరకు ఎవరూ గుమిగూడవద్దు అని సీపీ తెలిపారు. ఓట్ల లెక్కింపు రోజున రోడ్లు, జనావాసాల్లో టపాసులు పేల్చడం నిషేధం అని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

# తెలంగాణ పునర్నిర్మాణంలో సీఎం రేవంత్ కీలకపాత్ర..



హైదరాబాద్, నవంబర్ 8:తెలంగాణ పునర్నిర్మాణంలో సీఎం రేవంత్‌రెడ్డి కీలకపాత్ర పోషిస్తున్నారని పీసీసీ వైస్ ప్రెసిడెంట్, సనత్ నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డాక్టర్ కోట నీలిమ కొనియాడారు. సీఎం రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శనివారం సనత్ నగర్ నియోజకవర్గంలో పలు డివిజన్లలో జన్మదిన వేడుకలు నిర్వహించారు.

ముందుగా శ్యామలకుంటలో కంజర్ల విజయలక్ష్మి యాదవ్ ఆధ్వర్యంలో అంగన్వాడీ సెంటర్ లో నిర్వహించిన పుట్టినరోజు వేడుకల్లో మంత్రి అజారుద్దీన్ తో కలిసి పాల్గొన్నారు. ఈ క్రమంలో వారితో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం అమీర్ పేట్ లో కేక్ కట్ చేసి అన్నదానం నిర్వహించి సీఎం రేవంత్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా నీలిమ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. సంక్షేమ రంగానికి పెద్దపీట వేస్తూ.. ఆరు గ్యారంటీల అమలు కోసం సీఎం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

పదేళ్లుగా దోపిడీకి గురైన తెలంగాణను గాడిలో పెట్టేందుకు రెండేళ్లుగా రేవంత్ చేస్తున్న పోరాటానికి అన్ని వర్గాల ప్రజలు నిండు మనసుతో మద్దతు పలుకుతున్నారని చెప్పారు. జనహృదయ నేత బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి నిరుపేదల పక్షపాతి అయిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకుంటూ మరెన్నో సంక్షేమ ఫలాలు రాష్ట్ర ప్రజలకు అందించాలని ఆకాంక్షించారు.

నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడటంలో భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ప్రజలకు మరింత సుభిక్షంగా పాలన అందించేందుకు, రాబోయే కాలంలో కూడా ప్రజల ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు రేవంత్ రెడ్డికి మరింత శక్తిని ఇవ్వాలని ప్రార్థించారు.

# సుప్రీం చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయిపై దాడికి నిరసనగా 17న ఛలో ఢిల్లీ

## -ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేశ్ మాదిగ



నకిరేకల్, నవంబర్ 08 : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ మీద దాడి జరిగి నెల రోజులు కావస్తున్న ఇప్పటికీ కేసులు నమోదు చేయకపోవడాన్ని నిరసిస్తూ ఈ నెల 17న ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఢిల్లీలో పెద్ద ఎత్తున దళితుల ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్ మాదిగ, ఎంఎస్‌పీ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఇంజం వెంకటస్వామి మాదిగ అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ అలాగే అనుబంధ సంఘాల కార్యవర్గ సమావేశం ఎన్ఎస్ లక్ష్మి ఫంక్షన్ హాల్‌లో సూర్యాపేట జిల్లా ఇన్‌చార్జి బచ్చలకూర వెంకటేశ్వర్లు మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ స్థానంలో ఉన్న దళితుడికే రక్షణ లేకపోతే దేశంలో సామాన్య దళితులకు రక్షణ ఎలా ఉంటుందన్నారు. ఈ దాడి జరిగి నెల రోజుల కావస్తున్నా ఇప్పటికీ కేసు నమోదు చేయకపోవడం దారుణమని అన్నారు. జస్టిస్ గవాయ్ గారి స్థానంలో ఉన్నత కులాలకు చెందిన జడ్జీ ఉంటే కేసు నమోదు చేయడంలో ఇలా నిర్లక్ష్యం చేసి ఉండే వారా? అని ప్రశ్నించారు. అందుకే జస్టిస్ బిఆర్ గవాయ్ గారి మీద జరిగిన దాడి దళితులపైన జరిగిన దాడిగా చూస్తున్నామన్నారు.

దళితులు ఎంత ఉన్నత స్థానానికి కష్టపడి ఎదిగినా కుల రక్కసి వెంటాడుతుందన్నారు. అందుకే ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేయడంలో నిర్లక్ష్యం వహించారు. న్యాయవ్యవస్థ, జాతీయ మానవ హక్కుల కమిషన్ సుమోటోగా కేసు స్వీకరించకుండా కుల వివక్షతను పక్షపాతాన్ని చూపాయన్నారు. అందుకే గవాయిపై దాడి ఘటనను నిరసిస్తూ జాతీయ స్థాయిలో దళితుల ఆత్మగౌరవ పోరాటం చేపడుతున్నామన్నారు. కానీ 12 రోజులుగా ఎదురుచూస్తున్నా నేటికీ న్యాయం జరగలేదన్నారు. కనుకనే ఉద్యమానికి పిలుపునివ్వడం జరిగిందన్నారు. తక్షణమే దాడి ఘటన మీద కేసు నమోదు చేయాలి. నిందితుడిని అరెస్ట్ చేసి జైలులో పెట్టాలి. అలాగే ఈ ఘటన మీద సుప్రీం కోర్టు రిటైర్డు జడ్జీ చేత విచారణ జరిపించి దీని వెనుక ఉన్న శక్తులను గుర్తించాలన్నారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా సహించేది లేదన్నారు. చీఫ్ జస్టిస్ పై దాడి విషయంలో న్యాయాన్ని కోరుతూ నవంబర్ 17న ఛలో ఢిల్లీ ''దళితుల ఆత్మగౌరవ ర్యాలీ'' నిర్వహిస్తామని, ఈ ర్యాలీలో ఆత్మగౌరవంతో జీవించాలని కోరుకునే దళిత ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, భువనగిరి జిల్లా ఇన్‌చార్జి బిర్రు మహేందర్ మాదిగ, ఎంఎస్‌పీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్ మాదిగ, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజయ్య మాదిగ, భువనగిరి జిల్లా అధ్యక్షుడు నల్ల చంద్రస్వామి మాదిగ, ఎమ్మార్పీఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు చింత వినయ్ బాబు మాదిగ, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం మాదిగ, మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేపాక వెంకన్న, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు, ఎంఎస్‌పీ జాతీయ నాయకులు మాచర్ల సైదులు మాదిగ, రాష్ట్ర నాయకులు ఎర్ర వీరస్వామి మాదిగ, ఎంఎంఎస్ జిల్లా అధ్యక్షురాలు కురుపాటి కములమ్మ, ఎంఎస్‌పీ నల్లగొండ సూర్యాపేట జిల్లా అధికార ప్రతినిధి ఏపూరి రాజు మాదిగ, మడుపు శ్రీనివాస్ మాదిగ, మాచర్ల సుదర్శన్, వంగూరి ప్రసాద్, గాదె రాజు, కారుపాటి అంబేద్కర్, నకిరేకంటి వెంకటరత్నం, బట్ట శ్రీను, నల్ల స్వామి, బాకీ వెంకన్న పాల్గొన్నారు.

# నవీన్ యాదవ్‌కు పాస్టర్లు మద్దతు..



హైదరాబాద్, నవంబర్ 8: జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ క్లబ్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా పాస్టర్ల సమావేశం శుక్రవారం ఘనంగా జరిగింది.

ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకట్ స్వామి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, అలాగే ఏఐసీసీ సెక్రటరీలు విశ్వనాథ్, సంపత్ కుమార్, దీపక్ జాన్ తదితర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న పాస్టర్లు రానున్న నవంబర్ 11న జరగనున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను ఘన విజయంతో గెలిపించేందుకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.


**డా॥ అంబల్ల జనార్ధన్ వజ్రోత్సవ అభినందన సమితి**

**ఆహ్వానం**

**డా॥ అంబల్ల జనార్ధన్ గారి వజ్రోత్సవం**
**శ్రీమతి అంబల్ల సువర్ణ-డా॥ అంబల్ల జనార్ధన్ గార్ల వివాహ స్వర్ణోత్సవం** మరియు



డా॥ అంబల్ల జనార్ధన్‌గారి కథానికా సంపుటి
**"ప్రాణధార"**
మరియు
**"వజ్రోత్సవ అభినందన సంచిక"**



**ఆవిష్కరణ**

| | |
|---|---|
| **సభాధ్యక్షులు** | : **శ్రీ బైస దేవదాసు** |
| "ప్రాణధార" కథా సంపుటి ఆవిష్కర్త | సంపాదకులు: నేటినిజం దినపత్రిక |
| **గౌరవ అతిథి** | : **ఆచార్య డా॥టి.గౌరీశంకర్** |
| అభినందన సంచిక ఆవిష్కర్త | అధ్యక్షులు:అం.జి.వజ్రోత్సవ అభినందన సమితి |
| **విశిష్ట అతిథి** | : **శ్రీ రఘుశ్రీ** కార్యదర్శి: అం.జి.వజ్రోత్సవ అభినందన సమితి. |
| **ఆత్మీయ అతిథి** | : **శ్రీ పి. చంద్రశేఖర ఆజాద్** ప్రముఖ రచయిత, కవి. |
| **ఆత్మీయ అతిథి** | : **శ్రీ ఎం.వి. రామిరెడ్డి** ప్రముఖ రచయిత, కవి, అధ్యక్షులు:రాంకీ ఫౌండేషన్ |
| **ఆత్మీయ అతిథి** | :**శ్రీవి.పి.చందన్‌రావు** ప్రముఖ కవి,వ్యాఖ్యాత |

**తేది: 09-11-2025, ఆదివారం, ఉ॥ 11.00 గంటలకు**

**వేదిక:** శ్రీ రాజ రాజేశ్వర-శ్రీ వేంకటేశ్వర మందిర ప్రాంగణ,ధర్మోరా గ్రామం, మోర్తాడ్ మండలం, నిజామాబాద్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం.

Dharmora on Google Maps
https//maps.app.goo.gl/ZeMkXAKNFyTKWKnzb
ధర్మోరా గ్రామం, హైద్రాబాద్ నుండి దాదాపు 200 కి.మీ.
నిజామాబాద్ నుండి 45 కి.మీ,
ఆర్మూర్ నుండి దాదాపు ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.
ముందస్తు సూచన ఇచ్చినచో ఆర్మూర్ నుండి తేది 09-11-2025న ఉ॥10 గంటలకు ఒక కారు, 10-45 గంటలకు ఒక కారు ఏర్పాటు చేయగలము.

**ముఖ్య గమనిక:** దయచేసి కానుకలు, శాలువాలు, పుష్పగుచ్ఛాలు తేవద్దు. వాటి కంటే సభా ప్రాంగణంలో ఉంచిన డా॥అంబల్ల జనార్ధన్ గారు రచించిన కథల పుస్తకాలు రాయితీ ధరపై కొని, చదివి, స్పందిస్తే మాకు సంతోషం.

**-డా॥ అంబల్ల జనార్ధన్ వజ్రోత్సవ అభినందన సమితి.**

# లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం ముందు అందరూ సమానమే !

## (09 నవంబర్ : జాతీయ న్యాయ సేవల దినం" సందర్భంగా)

భారత దేశవ్యాప్తంగా బలహీన వర్గాల ప్రజలకు ఉచిత న్యాయ సేవలు అందించడంతో పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలనే సదుద్దేశంతో కేంద్ర ప్రభుత్వం చేసిన లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆక్ట్ 1987 తీసుకురావడం జరిగింది. ఈ చట్టం 09 నవంబర్ 1995 నుంచి అమలులోకి రావడంతో ఆ రోజు ప్రత్యేకతను గుర్తించిన ప్రభుత్వం ప్రతి ఏట 09 నవంబర్‌న "జాతీయ న్యాయ సేవల దినం లేదా నేషనల్ లీగల్ సర్వీసెస్ డే" పాటించడం ఆనవాయితీగా మారింది. ఈ చట్టం ద్వారా జాతీయ స్థాయిలో "నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ లేదా జాతీయ న్యాయ సేవల అథారిటీ, రాష్ట్ర స్థాయిలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నాయకత్వంలో "రాష్ట్ర న్యాయ సేవల అథారిటీ(స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ)", జిల్లా స్థాయిలో "జిల్లా న్యాయ సేవల అథారిటీ(డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ)" ఆయా ప్రాంతాల బడుగు బలహీన వర్గాలకు ఉచితంగా న్యాయ సేవలు అందిస్తూనే అవగాహన కార్యక్రమాలను నిర్వహించుట జరుగుతున్నది. జాతీయ న్యాయ సేవల దినోత్సవం-2025 ఇతివృత్తంగా "న్యాయ సేవల అవగాహన అంతరాలను తగ్గించడం" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు.

### చట్టం ముందు అందరూ సమానమే:

న్యాయ దేవత, చట్టం ముందు అందరూ సమానమే. ఉన్న వారికి ఒక న్యాయం, లేని వారికి మరో న్యాయం అందుకున్న అకాలమిది. చేసే వారికి తగు శిక్షలు తక్షణమే పడాలి. న్యాయం కావాలని కోర్టులో కేసులు పట్టడం చాలా ఖర్చుతో కూడుకున్న అంశం అని మనందరికీ తెలుసు. న్యాయం కోసం కోర్టు మెట్లు ఎక్కలేదని నిరుపేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఉచితంగా న్యాయం అందించడం, న్యాయ సంబంధ అవగాహనలు నిర్వహించడం, మైనారిటీ/ఎస్సి/ఎస్టీ/మహిళలు/పిల్లలు/ మానవ అక్రమ రవాణా విషవలలో చిక్కిన వారికి ఉచితంగా న్యాయ సేవలు లీగల్ సర్వీసెస్ అథారిటీ సంస్థ ద్వారా అందించడం జరుగుతోంది. న్యాయ హక్కుల పట్ల సరైన అవగాహన లేని సమాజంలో మనం ఉన్నాం. పేదలకు సహితం న్యాయమైన హక్కులు అనుభవించే అవకాశం ఇవ్వడమే న్యాయ సేవల అథారిటీ లక్ష్యంగా తీసుకోబడింది. క్షేత్ర స్థాయిలో లోక్ అదాలత్‌లను నిర్వహిస్తూ, సమస్యలకు పరిష్కారాలు అక్కడికక్కడే అందించే ప్రయత్నాలు ఈ అథారిటీల ద్వారా జరుగుతున్నాయి.

### జాతీయ స్థాయి నుంచి తాలూకా స్థాయి వరకు ఉచిత న్యాయ సేవల అథారిటీలు:

దేశవ్యాప్తంగా సుప్రీమ్ కోర్టు స్థాయిలో నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, హైకోర్టుల పరిధిలో 39 హైకోర్టు లీగల్ సర్వీసెస్ అథారిటీలు, 37 స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీలు, 673 డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీలు, 2465 తాలూకా స్థాయి లీగల్ సర్వీసెస్ అథారిటీలు ఉచిత న్యాయ సేవలను బలహీన వర్గాలకు అందిస్తున్నాయి. లీగల్ సర్వీసెస్ అథారిటీల ద్వారా ఉచిత న్యాయ సేవలు, లీగల్ రైట్స్ పట్ల అవగాహనలు, న్యాయన్ని వేగంగా అందించడం, పేదలకు న్యాయ సేవలు అందుబాటులోకి రావడం, కోర్టు మెట్లు ఎక్కకుండానే న్యాయం పొందగలగడం, లోక్ అదాలత్‌లను నిర్వహించి సత్వరమే కేసులను పరిష్కరించడం లాంటి మహత్తర కార్యాలను న్యాయ సేవల అథారిటీలు నిర్వహిస్తున్నాయి.

అందరికీ సరైన న్యాయం సమానంగా అందాలి. ఆర్థికంగా చితికిన బడుగుల చెంతకు న్యాయ సేవలు ఉచితంగా అందించబడాలి. చట్టం ముందు తరతమ భేదాలు ఉండకూడదు. కోర్టుల్లోకి చేరి దశాబ్దాలుగా కోర్టుల్లో కేసులు పొడిగించబడి కుటుంబాలు చితికి పోకూడదు. న్యాయం అందడానికి సమయం పట్టకూడదు. ఆలస్యంగా న్యాయం అందినా అది అన్యాయమే అవుతుందని గమనించి ఉచిత న్యాయ సేవలు అందిస్తున్న లీగల్ సర్వీసెస్ అథారిటీలను ఆశ్రయించి సత్వర న్యాయం పొందాలని ఆశిద్దాం, కోర్టు మెట్లెక్కని రోజులు రావాలని కోరుకుందాం.

-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# భారత్, భరతమాత, భారతదేశమనే శాశ్వత భావనే వందేమాతర సారాంశం: పీఎం

న్యూఢిల్లీ, నవంబర్ 8:దేశం కోసం వందేమాతరం ఆలపిస్తూ.. ప్రాణత్యాగం చేసిన అందరికీ తెలిసిన, తెలియని, మరుగునపడిన, చరిత్ర పుటలకెక్కని వీరులందరికీ 140 కోట్ల మంది భారతీయులు ఈ రోజు నివాళులు అర్పిస్తున్నారని ప్రధానమంత్రి ప్రకటించారు.

వేద శ్లోకాన్ని చెబుతూ.. ఇది మన మాతృభూమి అని, ఈ దేశం మన తల్లి అని, మనం ఆమె పిల్లలమని, వేద కాలం నుంచి భారతీయులు దేశాన్ని మాతృమూర్తిగా కొలిచారని శ్రీ మోదీ అన్నారు. వందేమాతరం ద్వారా ఈ వేద భావన స్వాతంత్ర్య సమరంలో కొత్త చైతన్యాన్ని నింపిందని వెల్లడించారు.

దేశాన్ని ఒక భౌగోళిక-రాజకీయ ప్రదేశంగా మాత్రమే చూసేవారికి... అలా కాకుండా తల్లిగా పరిగణించాలనే ఆలోచన ఆశ్చర్యం అనిపించవచ్చునని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. కానీ, భారత్ ఇందుకు భిన్నం... ఇక్కడ తల్లి అంటే- జన్మనిచ్చేది.. పెంచిపోషించేది మాత్రమే కాదు బిడ్డలకు ప్రమాదం కలిగించే దుష్టశక్తులను అంతం చేసే భద్రకాళి. కాబట్టే- భరతమాత శక్తి అపారమని, కష్టాల నుంచి మనల్ని గట్టెక్కించడమేగాక శత్రు నాశనం చేసిందని చెబుతూ- వందేమాతరంలోని పంక్తులను ఆయన ఉటంకించారు. దేశం ఒక తల్లి కాగా, ఆ తల్లి శక్తిసామర్థ్యాలు ఒక దైవ స్వరూపమనే భావనే స్వాతంత్ర ఉద్యమంలో స్త్రీ-పురుషులు సమాన భాగస్వాములు కావడానికి దారితీసిందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. నారీశక్తి భారత్‌ను మరోసారి పురోగమన పథంలో నిలపగలదనే స్వప్నాలకు ఊతమిచ్చింది ఈ దార్శనికతేనని చెప్పారు.

వందేమాతరం ఆనాడు స్వాతంత్ర్య పోరాట గీతమైనప్పటికీ, నేడు మనకు లభించిన స్వేచ్ఛను పరిరక్షించుకోవడంలోనూ ఇది స్ఫూర్తినిస్తున్నదని శ్రీ మోదీ పేర్కొన్నారు. బంకింబాబు అసలు కూర్పు నుంచి కొన్ని పంక్తులను ఈ సందర్భంగా ఉటంకించారు. దీని ప్రకారం... భరతమాత జ్ఞానప్రదాత అయిన సరస్వతీ స్వరూపం మాత్రమే కాదు... సౌభాగ్య ప్రదాత లక్ష్మీదేవి, సాయుధ శక్తిస్వరూపిణి దుర్గామాత కూడా! ఇది జ్ఞానం, శాస్త్ర, సాంకేతికతలలో ముందంజలో నిలిచే దేశాన్ని.. అభ్యసనం-ఆవిష్కరణల శక్తితో సుసంపన్న దేశాన్ని... జాతీయ భద్రతలో స్వావలంబన గల దేశాన్ని నిర్మించడమే ఈ దార్శనికత లక్ష్యమని ప్రధానమంత్రి స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి ఒక స్మారక తపాలా బిళ్లను, నాణాన్ని కూడా ఆవిష్కరించారు. దీంతో దేశవ్యాప్తంగా మరో ఏడాది పాటు... 2026 నవంబరు 7 వరకూ నిర్వహించే వేడుకలు నేటినుంచి ప్రారంభమయ్యాయి. భారత స్వాతంత్ర్య ఉద్యమానికి ఎంతో స్ఫూర్తినివ్వడమేగాక జాతీయ ప్రతిష్ఠ, ఐక్యతలను ప్రోదిచేసే ఈ గేయం 150 ఏళ్ల సంబరాలను కొనసాగిస్తుంది.

ఈ వేడుకలలో ప్రధాన కార్యక్రమంతోపాటు సమాజంలోని అన్ని వర్గాల పౌరుల భాగస్వామ్యంతో 'వందేమాతరం' పూర్తి గీతాన్ని బహిరంగ ప్రదేశాలలో సామూహికంగా ఆలపించారు.

ఈ ఏడాదితో వందేమాతరం 150 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ జాతీయ గీతాన్ని 1875 నవంబర్ 7న అక్షయ నవమి శుభ సందర్భంగా బంకించంద్ర ఛటర్జీ రాశారు. ఇది ఆయన నవల 'ఆనందమఠ్'లో భాగంగా తొలిసారి సాహిత్య పత్రిక 'బంగదర్శన్'లో ప్రచురితమైంది. శక్తిసామర్థ్యాలు, సౌభాగ్యం, దైవ స్వరూపంగా మాతృభూమిని ప్రార్థించే ఈ గీతం దేశ ఐక్యత, ఆత్మగౌరవాలను మేల్కొలిపే స్ఫూర్తికి కవితాత్మక వ్యక్తీకరణను సమకూర్చింది. అటుపైన అనతి కాలంలోనే దేశభక్తికి శాశ్వత ప్రతీకగా మారింది.

క్యాన్సర్ పట్ల అవగాహన పెంచడానికీ, సమగ్ర చికిత్స అందించడానికీ

# ఆచరణాత్మకమైన, ప్రజా ప్రయోజనాత్మక దృష్టికోణం ముఖ్యమన్న కేంద్ర మంత్రి శ్రీ ప్రతాప్‌రావ్ జాదవ్

న్యూఢిల్లీ, నవంబర్ 8:జాతీయ క్యాన్సర్ అవగాహనా దినోత్సవం సందర్భంగా, క్యాన్సర్ విషయంలో ప్రజల్లో జాగృతిని పెంపొందించడంతో పాటు, ఈ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించే కృషిని తీవ్రతరం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయుష్ శాఖ స్పష్టం చేస్తోంది. ప్రస్తుతం ప్రపంచమంతటా మరణాలకు కారణమవుతున్న వ్యాధుల్లో రెండో అతి ప్రధాన వ్యాధి క్యాన్సరే. అనేక దేశాల్లో నోటి క్యాన్సర్, గర్భాశయ సంబంధిత క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదయ్యాయి. ఈ సవాలును మరింత ప్రభావవంతంగా అధిగమించడానికి క్యాన్సర్‌పై అవగాహనను పెంచడానికీ, పరీక్షలపై దృష్టి కేంద్రీకరించడానికీ, సమగ్ర ఆరోగ్య సంరక్షణ పద్ధతుల్ని వ్యాప్తి చేయడానికీ భారత్ ప్రాధాన్యాన్నిస్తోంది.

పొగాకు వాడకం, అనారోగ్యకర ఆహారం, స్థూలకాయం, శరీరాన్ని చురుకుగా ఉంచుకోకపోవడం, మద్యపానం, పర్యావరణ కాలుష్యం, హెచ్‌పీవీ సంక్రమణలు వంటి నివారించదగ్గ అంశాలే క్యాన్సర్ ప్రబలడానికి దారి తీస్తున్నాయి. ఈ అంశాలపై ప్రజా చైతన్యాన్ని పెంపొందించడం, సకాలంలో తగిన చర్యలు తీసుకోవడం ముఖ్యమని ఈ పరిణామం సూచిస్తోంది. క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించడం వల్ల ఈ వ్యాధి బాధితులను కాపాడే అవకాశాలు చాలా వరకూ మెరుగు పడతాయి. మరీముఖ్యంగా రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ద్వార క్యాన్సర్, నోటి క్యాన్సర్లలో అనేక కేసులు క్రమబద్ధ పరీక్షల వల్ల చికిత్సకు అనువైన దశలోనే గుర్తించడం, వ్యాధి ముదరకుండా నయం చేయడం సాధ్యపడుతుంది. ప్రాథమిక దశలో గుర్తిస్తే అనేక రకాల క్యాన్సర్లను అరికట్టేందుకు వీలు ఉంటుంది. ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంబించడం కూడా ముఖ్యం. పొగాకు వాడే అలవాటును మానేయడం, ఆకుకూరలు తినడం, బరువును నియంత్రించుకోవడం, చురుగ్గా ఉంటూ, పొగాకు కాలుష్యాలకు దూరంగా ఉండడం ద్వారా క్యాన్సర్ ముప్పును తగ్గించుకోవచ్చు. ఇవి దీర్ఘకాలిక ఆరోగ్య సంరక్షణకు దోహదం చేస్తాయి.

క్యాన్సర్‌పై అవగాహనను పెంచడంతో పాటు నివారణ దిశగా ఆచరణాత్మక విధానాల్ని అవలంబించాల్సిన అవసరం ఉందని ఆయుష్ శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర హోదా), ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ ప్రతాప్‌రావ్ జాదవ్ స్పష్టం చేశారు. దేశంలో అందరికీ తక్కువ ఖర్చులో, సహాయక సేవల్ని అందుబాటులోకి తేవడానికి మంత్రిత్వ శాఖ మరిన్ని కార్యక్రమాలను చేపడుతోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఇంటిగ్రేటివ్ క్యాన్సర్ కేర్ సెంటర్లు, సహకార ప్రధాన పరిశోధనలు భాగంగా ఉన్నాయని వివరించారు. ఆధునిక క్యాన్సర్ విజ్ఞాన శాస్త్రానికి ఆయుష్ పద్ధతులను కూడా జతపరిచే కార్యక్రమాలు జీవన నాణ్యతను పెంచుతాయన్నారు. ప్రత్యేకించి బలహీన వర్గాల వారి విషయంలో చెప్పుకోదగిన మార్పు కలుగుతుందని ఆయన అన్నారు.

భారత్‌లో సమ్మిళిత క్యాన్సర్ చికిత్స ప్రధాన కార్యక్రమాల నెట్‌వర్క్ విస్తరణ తీరు.. శాస్త్రీయ వైద్యానికి సాంప్రదాయక చికిత్సా పద్ధతులను జత చేసే పద్ధతులను అందించడానికి మంత్రిత్వ శాఖ కట్టుబడి ఉందని ఆయుష్ కార్యదర్శి శ్రీ వైద్య రాజేశ్ కొటేచా అన్నారు. నైపుణ్య కేంద్రాలు, పరిశోధన వేదికలు, టీఎంసీ-ఏసీటీఆర్‌ఈసీ, ఆర్య వైద్య శాల, ఎయిమ్స్ తదితర ప్రఖ్యాత సంస్థలతో భాగస్వామ్యం వంటివి కొత్త చికిత్సా పద్ధతుల పట్ల అవగాహనను పెంచడంలో, వ్యాధి నివారణలో, రోగుల జీవన నాణ్యతను మెరుగు పరచడంలో తోడ్పడుతున్నాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమాలు.. వ్యవస్థీకృత పరిశోధన, సుశిక్షిత సిబ్బంది, ఆధునిక క్యాన్సర్ విజ్ఞానానికి సాయపడేందుకు ఆయుష్‌కున్న సామర్థ్యాన్ని నిరూపిస్తున్నాయని ఆయన అన్నారు.

సమ్మిళిత సంరక్షణ సేవలు, ఆయుష్ ఔషధ రూపకల్పన దిశగా కృషిచేస్తున్న ముంబయిలోని టీఎంసీ-ఏసీటీఆర్‌ఈసీ సహా కీలక కేంద్రాలను (సీఓఈలను) ఏర్పాటు చేయడం ద్వారా ఆయుష్ మంత్రిత్వ శాఖ సమగ్ర క్యాన్సర్ చికిత్సా సేవల్ని విస్తరింపచేస్తోంది. ఈ కేంద్రాలు ఇన్-సిలికో, ప్రీక్లినికల్, క్లినికల్ అధ్యయనాల్లోనూ, ప్రత్యేక ఓపీడీతో పాటు సామర్థ్యాన్ని పెంచే కార్యక్రమాల్లోనూ దన్నుగా నిలుస్తున్నాయి. కొట్టక్కల్ ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న ఆర్య వైద్య శాలలోని ఓ విశిష్ట సీఓఈ జీవన నాణ్యతతో పాటు సహాయక చికిత్సను అందించడంపైనా దృష్టిని కేంద్రీకరిస్తోంది. ఇది గత రెండేళ్లలో 338 ఊపిరితిత్తి క్యాన్సర్ రోగులు సహా 26,356 మంది క్యాన్సర్ పేషెంట్లకు చికిత్సను అందించి, సమ్మిళిత పద్ధతి ఎంత ప్రభావవంతమైనదో నిరూపించింది.

క్యాన్సర్ వ్యాధి వ్యాప్తిని ఎదుర్కోవడంలో నివారణ, ప్రాథమిక దశలోనే గుర్తించడం, సంపూర్ణ సహాయక చికిత్సను అందించే దిశగా భారత్ ముందుకు పోవడంలో కీలక పాత్రను పోషిస్తాయని ఆయుష్ శాఖ పునరుద్ఘాటిస్తోంది. అవగాహనను పెంచడం, మరిన్ని ఎక్కువ పరీక్షాకేంద్రాల్ని ఏర్పాటు చేయడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించేలా ప్రోత్సహించడం అత్యవసరమని తెలియజేస్తోంది. ఆయుష్ పద్ధతులు అందించే నివారక, సహాయక సేవలకు తోడు ఆధునిక చికిత్స పద్ధతులను జతకలవడం అదనపు ప్రయోజనాలను అందిస్తుంది.

# స్నేహితుడి కుటుంబానికి ఆపన్నహస్తం



నారాయణపేట, నవంబర్ 8: మృతి చెందిన స్నేహితుని కుటుంబానికి డిగ్రీ మిత్ర బృందం మేమున్నామంటూ అండగా నిలిచి ఆపన్నహస్తం అందించిన సంఘటన నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. ఊట్కూర్ మండల కేంద్రంలోని శ్రీరాంనగర్ వీధికి చెందిన లావరీ రామకృష్ణ కొంత కాలం క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతునికి భార్యా పిల్లలు ఉండడంతో పాటు పేదరికంతో కొట్టు మిట్టాడుతున్నారు. ఈ విషయాన్ని గ్రహించిన 2005-06 డిగ్రీ మిత్ర మండలి బృందం సభ్యులు చేయి చేయి కలిపి తమ స్నేహితుడి భార్య లక్ష్మికి రూ.30 వేలు ఆర్థిక సహాయం అందజేయడం తోపాటు దుస్తులు, వంట సామాను అందజేసి స్నేహానికి ఉన్న మాధుర్యాన్ని చాటారు.

# విచారణ చేపట్టిన పోలీసులు..

వరంగల్, నవంబర్ 8: వరంగల్ నగరంలోని ఎంఎం నగర్ దూపకుంట ప్రాంతంలో స్థల వివాదంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటన వరంగల్ మిల్స్ కాలని పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇంటి నిర్మాణం విషయంలో రెండు కుటుంబాలు ఘర్షణ పడటం వల్ల బాధితులు గాయపడ్డారు. వివాదం కాస్తా ఘర్షణకు దారి తీసింది. సంధ్య అనే మహిళ కుటుంబ సభ్యులపై మరో వర్గం దాడి చేశారని సమాచారం.

ఈ రోజు ఉదయం బాధితురాలి ఇంటి వద్ద ఘటన జరిగిందని పోలీసుల సమాచారం. దాడికి పాల్పడ్డవారిలో స్థానికేతరులు ఉన్నారని బాధితులు ఆరోపించారు గాయపడిన వారు మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. మిల్స్ కాలనీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సమాచారం సేకరించారు. ఘర్షణకు పాల్పడిన బాధితులు రాజు, సంధ్య అని ఇరువురు మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. జరిగిన ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు పేర్కొన్నారు.

# వాహనదారులకు మళ్లీ ఆంక్షలు

-హెల్మెట్ ఉంటేనే బ్యారేజీ పైకి అనుమతి
-విజయవాడలో మళ్లీ అమల్లోకి
-హెల్మెట్ లేనివారికి జరిమానా.. కౌన్సిలింగ్




అమరావతి, నవంబర్ 8: వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి అంటూ ట్రాఫిక్ పోలీసులు మళ్లీ ఆంక్షలు కఠిన తరం చేశారు. గతంలో హైకోర్టు సూచనలతో విజయవాడ నగరంలో హెల్మెట్ వినియోగంపై వాహనదారులకు పూర్తిస్థాయిలో అవగాహన, చైతన్యం కల్పించిన పోలీసులు మళ్లీ హెల్మెట్ తప్పనిసరి చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వారిని గుర్తించి వారికి కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు జరిమానా వసూలు చేశారు.

గత కొంతకాలంగా హెల్మెట్ వాడకం మళ్లీ తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో అప్రమత్తమైన విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు మళ్లీ ప్రత్యేక హెల్మెట్ డ్రైవ్ లను ప్రారంభించారు. ఈ నేపథ్యంలో విజయవాడ నగరవ్యాప్తంగా అన్ని కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులు హెల్మెట్ లేకుండా ప్రయాణించే వాహనదారులను గుర్తించి వారికి జరిమానా వేయడంతో పాటు ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు.

ప్రకాశం బ్యారేజీ మీద రాకపోకలు సాగించే వాహనదారులకు హెల్మెట్ ను తప్పనిసరి చేశారు. గడిచిన కొంతకాలంగా ఆంక్షలు లేకపోవడంతో వాహనదారుల్లో సైతం నిర్లప్తత వచ్చి హెల్మెట్లు లేకుండా ప్రయాణాలు ఎక్కువైన పరిస్థితులలో అప్రమత్తమైన ట్రాఫిక్ పోలీసులు హెల్మెట్ లేనిదే ప్రకాశం బ్యారేజీ మీదకి టు వీలర్స్ ను అనుమతించడం లేదు. శనివారం నుంచి ట్రాఫిక్ సీఐ ఉమామహేశ్వరరావు పర్యవేక్షణలో ప్రకాశం బ్యారేజీ మొదటిలో ఉన్న శనీశ్వర ఆలయం వద్ద ప్రత్యేక హెల్మెట్ డ్రైవ్ ను చేపట్టారు. ప్రకాశం బ్యారేజీ మీదుగా వెళ్లే ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరిస్తేనే బ్యారేజీ మీదికి అనుమతిస్తున్నారు. హెల్మెట్ తప్పనిసరి చేస్తూ ఉన్న ప్లే కార్డులను ప్రదర్శిస్తూ, మైకు ద్వారా ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు.




# పత్తి పంట ధ్వంసం

## ఆందోళనలో రైతులు

జైనూర్, నవంబర్ 8: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని మారుమూల గ్రామపంచాయతీ అయిన చిత్త కర్ర పంచాయతీల్లోని పత్తి పంట పొలాల్లో అడవి పందులు దాడులు చేసి పంటను ధ్వంసం చేస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కిషన్ నాయక్ తండాకు చెందిన రైతు పత్తి పంటను అడవిపందులు ధ్వంసం చేయగా ఈరోజు ఉదయం చిత్త కర్ర గ్రామానికి చెందిన ఆదివాసి రైతు కోట్నాక్ ఆనందరావు పత్తి పంటను విధ్వంసం చేసినట్లు రైతు ఆవేదనతో తెలిపారు. అడవి పందులు పంటలపై దాడులు చేస్తూ పత్తికాయలు తింటూ పంటను నాశనం చేస్తున్నాయని, ఆ ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీ శాఖ అధికారులు అడవి పందులు దాడి చేసి ధ్వంసం చేసిన రైతుల పంటలపై సర్వేలు చేసి అటవీ శాఖ ద్వారా ఆదుకోవాలని అడవిపందుల దాడులను నివారించే చర్యలు చేపట్టాలని ఆ ప్రాంత రైతులు కోరుతున్నారు.

# హైదరాబాద్‌లో ప్రారంభమైన జాతీయ గిరిజన ఉత్సవం 'ఆది బజార్-2025'

హైదరాబాద్, నవంబర్ 8:హైటెక్ సిటీలోని శిల్పారామం సమీపంలో గల ఇందిరా మహిళా శక్తి బజార్‌లో జాతీయ గిరిజన ఉత్సవం "ఆది బజార్ - 2025" ను సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (ఎస్‌ఈఆర్‌పీ) సీఈవో శ్రీమతి దివ్య దేవరాజన్, ఐఏఎస్ శుక్రవారం ప్రారంభించారు.

గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో... హైదరాబాద్‌లోని టీఆర్ఐఎఫ్‌ఈడీ (ఆంధ్రప్రదేశ్-తెలంగాణ) ప్రాంతీయ కార్యాలయం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ 10 రోజుల ఉత్సవం నవంబర్ 7 నుంచి 16 వరకు జరుగుతుంది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు, తెలంగాణ సహా ఇతర రాష్ట్రాల నుంచి దాదాపు 70 మంది గిరిజన కళాకారులు ఈ ఉత్సవంలో పాల్గొంటారు.

ప్రారంభ కార్యక్రమంలో దేవరాజన్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది గిరిజన కళాకారులకు ఇప్పటికీ తగినంత మార్కెట్ అనుభవం లేదన్నారు. "వినియోగదారులతో అనుసంధానమయ్యేందుకు, వారి ఆదాయాలను పెంచుకునేందుకు, సాంప్రదాయ జీవనోపాధిని ప్రోత్సహించేందుకు గిరిజనుల కోసం ఆది బజార్ ప్రత్యక్ష వేదికను అందిస్తుంది" అని ఆమె వ్యాఖ్యానించారు. గిరిజన వర్గాల ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా పౌరులు వారికి మద్దతునివ్వాలని దేవరాజన్ కోరారు.

గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న గిరిజన వర్గాల సాంస్కృతిక వారసత్వం, నైపుణ్యాలను ఇది ప్రదర్శిస్తుంది.

ఈ ప్రదర్శన-కమ్-సేల్‌లో గోండ్ (మధ్యప్రదేశ్), భీల్ (రాజస్థాన్), వార్లి (మహారాష్ట్ర)లకు చెందిన పెయింటింగ్‌లు... చందేరి, బాగ్ ప్రింట్ టెక్స్‌టైల్స్ (మధ్యప్రదేశ్)... బాగ్రు ప్రింట్ ఫాబ్రిక్స్ (రాజస్థాన్)... టస్సర్ సిల్క్ (ఛత్తీస్‌గఢ్)... తమిళనాడు నుంచి గిరిజన ఆభరణాలు... ఆసిఫాబాద్ (తెలంగాణ) నుంచి బంజారా ఎంబ్రాయిడరీ, లోహపు కళాకృతులు... గిరిజన ఉత్పత్తిదారుల సమూహాల నుంచి ఆర్గానిక్, సహజసిద్ధ ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాలు ఉంటాయి.సాంప్రదాయ కళాకారులు రూపొందించిన కళాకృతులు, వస్తువులను పట్టణ మార్కెట్లు, పర్యాటకులు, హస్త కళాకృతుల ఔత్సాహికులతో అనుసంధానించడం ద్వారా గిరిజన వర్గాలకు స్థిరమైన జీవనోపాధిని విస్తరించడం ఈ ఉత్సవాల లక్ష్యం.

# జాతీయ రహదారిపై పత్తి రైతుల ఆందోళన..



హైదరాబాద్, నవంబర్ 8: పత్తి కొనుగోలులో సీసీఐ అవలంబిస్తున్న వైఖరికి నిరసనగా ఆదిలాబాద్ జిల్లా నేరేడుగొండ మండల కేంద్రంలో రైతులు ఆందోళన చేపట్టారు. హైదరాబాద్–నాగపూర్ జాతీయ రహదారి 44 బైటాయించిన నిరసన తెలిపారు. దీంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.

కేంద్రం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలకు రూ.8,110 తో పత్తిని కొనుగోలు చేయాల్సిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా తేమ ఎక్కువగా ఉందంటూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తుందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 8 శాతం తేమ ఉంటేనే మద్దతు ధర చెల్లిస్తుందని అన్నారు. జిల్లాలో వర్షాలతో పాటు మంచు పడుతున్నందున పంటలో తేమ ఎక్కువగా ఉంటుందని, తేమ విషయంలో సడలింపు ఇవ్వాలని సీసీఐ అధికారులను కోరిన పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తంచేశారు.

కపాస్ కిసాన్ యాప్ ద్వారా పంట కొనుగోలును చేస్తున్న సీసీఐ మొదట ఎకరాకు 12 క్వింటాళ్లు కొనుగోలు చేసి ప్రస్తుతం ఏడు క్వింటాళ్లను మాత్రమే కొనుగోలు చేస్తుందని ఆరోపించారు. మిగతా పంటను రైతులు ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించి నష్టపోతున్నట్లు రైతులు తెలిపారు.

తేమతో సంబంధం లేకుండా పత్తి కొనుగోలును జరపాలని , ఎకరాకు ఏడు క్వింటాలు బదులు 12 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయాలని రైతుల డిమాండ్ చేశారు. రైతుల ఆందోళనతో జాతీయ రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి.

# ‘గృహ నిర్మాణ సామగ్రి రేట్ల పెరుగుదలను నియంత్రించాలి’

ఖమ్మం, నవంబర్ 8:: ఇందిరమ్మ గృహ నిర్మాణాల సమయాన్ని దృష్టిలో పెట్టుకుని గృహ నిర్మాణ సామగ్రి రేట్లను వ్యాపారులు అమాంతం పెంచడం పట్ల అధికారులు చర్యలు చేపట్టాలని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కౌన్సిల్ సభ్యులు మునిగడప వెంకటేశ్వర్లు, భూక్య శ్రీనివాస్ అన్నారు. శనివారం ఉన్నాందాస్ గడ్డలో జరిగిన ఇందిరమ్మ గృహ లబ్ధిదారుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న గృహ నిర్మాణాలను దృష్టిలో పెట్టుకుని ఇదే అదునుగా భావించి సిమెంట్, మట్టి, ఇటుకలు, ఇసుక, ఇనుప సామగ్రి తదితర గృహోపకరణాల రేట్లను వ్యాపారులు విపరీతంగా పెంచడం వల్ల లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు.

ఈ రేట్ల పెంపుదలతో గృహ నిర్మాణాల లబ్ధిదారులు ఆర్థికంగా చితికి పోవాల్సిన వస్తుందన్నారు. తక్షణమే ప్రభుత్వ అధికారులు ఇందిరమ్మ గృహ నిర్మాణ లబ్ధిదారులకి సిమెంట్, ఇటుక, ఇసుక, మట్టి, ఇనుప రాడ్లు తదితర సామగ్రి రేట్లు అందుబాటులో ఉండేటట్టుగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఉన్నందాస్ గడ్డ శాఖ 1, 2 కార్యదర్శులు ఎస్కే జలీల్, తొగరు నరేంద్ర కుమార్, నాయకులు గుంజ వెంకన్న, ఎస్.కె సుభాన్ అలీ, రాజు, రేవంత్, సంపత్, మైమున భాను, పద్మ కోరి కళ్యాణి, కొత్తూరు శారద పాల్గొన్నారు.

# నర్సాపూర్ ఎక్సైజ్ పోలీసుల అదుపులో రాజస్థాన్ బస్ డ్రైవర్..



మెదక్, నవంబర్ 8: ఓ రూట్ వాచ్ బస్సు(లగ్జరీ)లో పప్పి స్ట్రా పౌడర్ (ఓ రకమైన డ్రగ్స్, నల్లమందు)ను తరలిస్తుండగా ఎక్సైజ్ పోలీసులు నిఘా వేసి పట్టుకున్నారు. ఈ సంఘటన నర్సాపూర్ ఎక్సైజ్ పరిధిలోని తూప్రాన్ మండలం మనోహరాబాద్ జాతీయ రహదారి –44 టోల్ ప్లాజా వద్ద శనివారం చోటుచేసుకుంది.

ఎక్సైజ్ సీఐ గులాం ముస్తఫా మాట్లాడుతూ.. మనోహరాబాద్ టోల్ ప్లాజా వద్ద తనిఖీలు చేపట్టగా ఓ రూట్ వాచ్ బస్సులో 430 గ్రాముల పప్పి స్ట్రా పౌడర్ గుర్తించడం జరిగింది. ఈ డ్రగ్‌ను తీసుకువస్తున్న రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన బాలేసర్ పోస్ట్, బోధ్పూర్ జిల్లా బెల్వారనాజీ గ్రామానికి చెందిన రావల్సింగ్ (33) అనే బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకోవడం జరిగింది. ఈ పౌడర్ గసగసాల ద్వారా తయారీచేయడం జరుగుతుందని, ఇదో రకమైన మత్తుపదార్థమని, ఇది ఆరోగ్యానికి ఎంతో హానికరమని వెల్లడించారు.

రాజస్థాన్‌లో ఈ మత్తుపదార్థాన్ని రూ.800 లకు దొరికితే మన రాష్ట్రంలో సుమారు రూ.8000 వరకు విక్రయించి క్యాష్ చేసుకుంటారని తెలిపారు. మత్తుపదార్థాలను విక్రయించినా, వాడినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిందితుడిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేయడం జరిగిందని వెల్లడించారు. ఈ రైడ్‌లో నర్సాపూర్ ఎక్సైజ్ సీఐ గులాం ముస్తఫా, పీఆండ్ ఈఎస్ఐ ఎండి ఖాజా అజీజ్ అహ్మద్, పీఆండ్ ఈఎస్ఐ రాఘువేంద్రరావు, పీఆండ్ ఈసీ అనిల్, సత్తయ్య, ప్రభాకర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

# క్రీడల్లో రాణించి దేశానికి పేరు తీసుకురావాలి : ఎమ్మెల్యే సంజయ్ కుమార్




జగిత్యాల, నవంబర్ 8: క్రీడాకారులు ఒలింపిక్స్‌లో పతకాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి గొప్ప పేరు తెచ్చే విధంగా లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. పట్టణంలోని గీతా విద్యాలయం మైదానంలో శనివారం తెలంగాణ మహిళల ఇంటర్ డిస్టిక్ సాఫ్ట్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలను ప్రారంభించారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు, ఫైన్ ఆర్ట్స్ ముఖ్యమన్నారు. క్రీడలు ప్రోత్సహించడం ద్వారానే అంతర్జాతీయ స్థాయిలో పథకాలు సాధిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో స్పోర్ట్స్ పాలసీ తీసుకురావడం వల్ల విద్య, ఉద్యోగాల్లో 2 శాతం రిజర్వేషన్ కల్పనతో క్రీడలకు ప్రోత్సాహం కలుగుతుందని అన్నారు.

తెలంగాణలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని వెల్లడించారు. జగిత్యాల నియోజకవర్గంలో క్రీడా మైదానాల అభివృద్ధికి కృషి చేస్తానని వెల్లడించారు. ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి చేశారు. క్రీడాకారులకు పండ్లు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఇండియన్ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి శోభన్ బాబు, జగిత్యాల సాఫ్ట్ బాల్ అసోసియేషన్ సభ్యులు సుధాకర్ , డీవైఎస్‌వో రవి బాబు, రాజ్ కుమార్ , పురుషోత్తం, అశోక్ రావు , శరత్ రావు, వేణు గోపాల్ మోహన్ వెంకటేష్ యం ఏ ఆరిఫ్ కొలగని సత్యం, తిరుమలయ్య, దుమాల రాజ్ కుమార్ , కోటేశ్వర రావు, బిక్షపతి, శ్రీనివాస్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# రాజాపేటలో ముగిసిన గురుకుల జోనల్ స్థాయి క్రీడలు

నల్గొండ, నవంబర్ 8:తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో రాజాపేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించిన 11వ జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో వివిధ పాఠశాలల నుండి వచ్చిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శనివారం ముగింపు కార్యక్రమంలో భాగంగా రాజాపేట పేట ఎస్ఐ అనిల్ కుమార్ మాట్లాడుతూ.. ఆటలో గెలుపు ఓటములు సహజం అని, విద్యార్థి దశ నుండే కష్టపడడం అలవాటు చేసుకోవాలన్నారు. వ్యక్తి జీవితంలో క్రీడలు ఎంతో ప్రభావం చూపుతాయన్నారు. శారీరక, మానసిక అభివృద్ధికి క్రీడలు ఎంతో దోహద పడుతాయన్నారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సుధాకర్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాక్షించారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీఓ వి.సుధాకర్, క్రీడల సమన్వయకర్త జి.శ్రీనివాస్, పీడీలు కిషన్, వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ వేణు పాల్గొన్నారు.

# వేధింపులపై ధైర్యంగా ఫిర్యాదు చేయాలి : ఎస్పీ నరసింహ



సూర్యాపేట, నవంబర్ 8:: మహిళలు, యువతులు వేధింపులను ఉపేక్షించకుండా ధైర్యంగా ఫిర్యాదు చేయాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నరసింహ అన్నారు. శనివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి సమస్యలు ఉన్నా నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చునని, బాధితులు ఫిర్యాదులు చేసినప్పుడే పటిష్టంగా నిర్మూలించవచ్చన్నారు. మహిళల రక్షణ కోసమే షీ టీమ్స్ కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో సూర్యాపేట, కోదాడ డివిజన్ పరిధిలో షీ టీమ్ బృందాలు పనిచేస్తున్నాయన్నారు. షీ టీమ్ ఆధ్వర్యంలో వివిధ ప్రదేశాలలో, స్కూల్స్ , కాలేజీల్లో ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఆత్మహత్యల నివారణ, డ్రగ్స్ దుష్ప్రభావాలు, బాల్య వివాహాల నిరోధం, వరకట్నం చట్టాలపై, నూతన మహిళా చట్టాలపై, డయల్ 100, ౧-ాంఈఇ యాప్, మహిళ భద్రత, రక్షణ చర్యలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తునట్లు తెలిపారు.

టీమ్ సభ్యులు ప్రత్యక్షంగా ఫిర్యాదులు తీసుకుంటారని, ఆన్‌లైన్, ఖీఖీ ఇ-నీటవ, వాట్సప్ ద్వారా కూడా స్వీకరిస్తారన్నారు. మహిళలు, బాలికలపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టేవారు, సైబర్ నేరగాళ్లపై కూడా సైబర్, షీ టీమ్ సమన్వయంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మహిళలు, బాలికలు, విద్యార్థినులు షీ టీమ్ సేవలు ఉపయోగించుకోవాలని సూచించారు. ఎవరైనా వేధించినా, రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేళనగా మాట్లాడినా, ఉద్దేశపూర్వకంగా వెంబడించినా, అసభ్యకరంగా ప్రవర్తించినా, మాట్లాడినా విద్యార్థినులు, మహిళలు అత్యవసర పరిస్థితుల్లో జిల్లా పోలీస్ షీ టీమ్ నంబర్ 8712686056 కి కాల్ చేసి, లేదా వాట్సాప్ ద్వారా సందేశం పంపించి లేదా 100కు కాల్ చేసి తక్షణ పోలీస్ సహాయం పొందాలని పేర్కొన్నారు.

# జూబ్లీహిల్స్ ఎన్నికల తర్వాత రేవంత్‌రెడ్డికి పదవీగండం.. జగదీశ్‌రెడ్డి




హైదరాబాద్, నవంబర్ 8: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలో భయం మొదలైందని.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల తర్వాత పదవీగండం పొంచి ఉందని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన బీఆర్ఎస్ నేతలతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం మానసిక స్థితి దెబ్బతిన్నట్లుందని.. సందర్భం లేకుండా మాట్లాడుతున్నారని.. ఆయనను చూసి సిగ్గు సిగ్గుపడేలా ఉందని విమర్శించారు. నిఘా పెట్టేందుకు కేసీఆర్ కమాండ్ కంట్రోల్ కడితే.. రేవంత్ రెడ్డి కమాండ్ కంట్రోల్‌లో కూర్చొని తమపై నిఘా పెడుతున్నాడని ఆయన ప్రశ్నించారు. ప్రగతిభవన్‌లో బుల్లెట్ ప్రూఫ్ కిటికీలు ఉంటే చూపించాలని సవాల్ విసిరారు. బుల్లెట్ ప్రూఫ్ కిటికీలు, కమాండ్ కంట్రోల్, సెక్రటేరియట్‌పై కమిషన్ వేయవచ్చు కదా.. బుల్లెట్ ప్రూఫ్ కిటికీలు చూపిస్తావా?ప్రగతి భవన్‌ల ఎన్ని రూములున్నాయో చూపిస్తావా? అంటూ ప్రశ్నించారు.

హైదరాబాద్ అభివృద్ధి అజెండాపైనే జూబ్లీహిల్స్ ప్రజలు ఓటు వేయబోతున్నారని జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. దేశంలో ఎవరూ తిట్టని విధంగా వైఎస్సార్‌ను, సోనియా గాంధీని తిట్టింది రేవంత్‌రెడ్డియేనన్నారు. ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలను ఎన్ని రోజులు భయపెడుతావంటూ నిలదీశారు. ఏం చేసినా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవదని, రేవంత్ రెడ్డి చేసే తప్పులకు చరిత్ర క్షమించదన్నారు. రేవంత్ రెడ్డి నోటి దూలతో బీహార్ నుంచి వెల్లగొట్టే పరిస్థితి వచ్చిందని.. బిహార్ ఎన్నికల ప్రచారానికి రేవంత్ రెడ్డిని వద్దని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని పిలిపించుకున్నారన్నారు. కిషన్ రెడ్డి, రేవంత్ రెడ్డి పదవుల్లో ఉన్నారు కాబట్టి.. ఇద్దరు బ్యాడ్ బ్రదర్స్ అన్నారు. కిషన్ రెడ్డి, రేవంత్ రెడ్డి ఇద్దరూ మోదీ శిష్యులేనని.. తెలంగాణ అభివృద్ధి, హైదరాబాద్ అభివృద్ధి బాధ్యత రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి, బండి సంజయ్ తీసుకోవాలని సూచించారు.

మాగంటి గోపీనాథ్ తల్లితో ఎవరు మాట్లాడిస్తున్నారో అందరికీ తెలుసునన్నారు. రేవంత్ రెడ్డి ఓటమి భయంతో చేసే పనుల్లో ఇది ఒకటని.. రేవంత్ రెడ్డి డ్రగ్స్ మత్తులో మాట్లాడుతున్నట్లుగా ఉందన్నారు.

రేవంత్ రెడ్డి సీఎంగా వచ్చాక డ్రగ్స్ సంబంధ నేరాలు ఎక్కువయ్యాయని.. పోలీస్ కమిషనర్లే నేరాల రేటు పెరిగిందని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. కేసీఆర్ హయాంలో డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపారన్నారు. హరీశ్‌రావుపై రేవంత్ చిల్లర వ్యాఖ్యలు చేశారంటూ విమర్శించారు. .పార్టీలో హోంగార్డ్, ఐపీఎస్, ఎవరు పెద్ద.. ఎవరు చిన్నా అని రేవంత్ హరీశ్ ఎప్పుడూ మాట్లాడలేదన్నారు. సీఎం బాధతో తెలంగాణ పరువుపోతుందని.. ఇప్పటికైనా ఆయన తన భాష మార్చుకుంటే మంచిదంటూ హితవు పలికారు. సమావేశంలో మాజీ ఎంపీ లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, గాదరి కిషోర్ కుమార్, బూడిద భిక్షమయ్య గౌడ్, బీఆర్ఎస్ నేతలు చింతల వెంకటేశ్వర్ రెడ్డి, దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

# పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి : యానాల దామోదర్ రెడ్డి

నల్గొండ, నవంబర్ 8: పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి అకాల వర్షంతో దెబ్బతిన్న పత్తిని ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం రామన్నపేట మండల కేంద్రంలో జరిగిన సిపిఐ మండల కౌన్సిల్ సమావేశానికి దామోదర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సిపిఐ 100 సంవత్సరాల శత జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఖమ్మం బహిరంగ సభ జయప్రదం కోసం హైదరాబాద్ నుండి బస్సు జాతా ప్రారంభమై ఈ నెల 20, 21న యాదాద్రి భువనగిరి జిల్లాకు చేరుకుంటున్న సందర్భంగా పార్టీ శ్రేణులు, ప్రజానాట్య మండలి కళాకారులు స్వాగతం పలికి బహిరంగ సభ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఎర్ర రమేశ్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎండీ ఇమ్రాన్, మండల కార్యదర్శి ఊట్కూరు నరసింహ, ఏఐటీయూసీ మండల కార్యదర్శి శివరాత్రి సమ్మయ్య, పట్టణ కార్యదర్శి రచ్చ యాదగిరి, సీనియర్ కామ్రేడ్ బాలగోని మల్లయ్య, ఊట్కూరు భగవంతు, గంగాపురం వెంకటయ్య, ఊట్కూరి కృష్ణ, జగన్నాథం, పెండం రవీందర్, మీసం గాలయ్య, పట్ల నరసింహ, రచ్చ దయాకర్ పాల్గొన్నారు.

# చేనేత కుటుంబాలకు ఉచిత కంటి వైద్య శిబిరం

వరంగల్, నవంబర్ 8: బచ్చన్నపేట మండల కేంద్రంలోని చేనేత కుటుంబాలు అందరికీ ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు యునైటెడ్ వే హైదరాబాద్ సంస్థ ఒక ప్రకటనలో వెల్లడించింది. బచ్చన్నపేట మండల కేంద్రంలోని పద్మశాలి భవన్‌లో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని సంస్థ ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు. శిబిరంలో నిపుణులైన వైద్యులతో పరీక్షలు నిర్వహించబడతాయన్నారు. శిబిరానికి వచ్చే చేనేత కార్మికులు ఆధార్ కార్డుతోపాటు, ఢిల్లీ చేనేత గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలన్నారు. బచ్చన్నపేట మండల కేంద్రంలోని పద్మశాలి కుటుంబ సభ్యులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంస్థ సభ్యులను కోరారు.

# ప్రధాని నరేంద్ర మోడీ తనకు ప్రియ మిత్రుడు - అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్

న్యూయార్క్ నవంబర్ 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ప్రధాని నరేంద్ర మోడీ తనకు ప్రియ మిత్రుడని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. ప్రధాని మోడీ గొప్ప వ్యక్తి అని ప్రశంసించారు. పిఎం మోడి రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం తగ్గించారని పేర్కొన్నారు. బరువు తగ్గించే మందుల ధరలను తగ్గించడానికి భారత్‌తో కొత్త ఒప్పందాన్ని ట్రంప్ ప్రకటించారు. ఈ సందర్భంగా వైట్ హౌస్ లో ట్రంప్ మీడియాతో మాట్లాడారు. ఇండియాతో వాణిజ్య చర్చలు జరపడానికి సిద్ధంగా ఉన్నానని వెల్లడించారు. తాను భారత్‌కు వెళ్లిన తరువాత మోడీతో చర్చలు జరుపుతానని స్పష్టం చేశారు. వచ్చే సంవత్సరం భారత్‌లో పర్యటించాలని మీరు అనుకుంటున్నారా? అని జర్నలిస్టు ప్రశ్నించడంతో అవునని ట్రంప్ సమాధానం ఇచ్చారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య చర్చలు కొనసాగుతున్న వేళ భారత్ పర్యటన స్పందించడం గమనార్హం. ఫార్మా కంపెనీలతో ఒప్పందం జరుగుతుండగా ట్రంప్ పక్కను ఉన్న ఓ ఫార్మాస్యూటికల్ ఎగ్జిక్యూటివ్ గోర్డాన్ ఫైండ్లే స్పృహతప్పి కిందపడిపోయాడు. దీంతో ఈ కార్యక్రమానికి కొంతసేపు అంతరాయం ఏర్పడింది.




# సిమెంట్ అక్రమ తరలింపుపై విజిలెన్స్ విచారణ

ఖమ్మం, నవంబర్ 8:అక్రమంగా తరలించిన సిమెంట్ స్వాధీనం అంటూ గురువారం నమస్తే తెలంగాణ ఆన్‌లైన్‌లో ప్రచురితమైన కథనానికి సింగరేణి విజిలెన్స్ అధికారులు స్పందించి విచారణ చేపట్టారు. శనివారం సింగరేణి కొత్తగూడెం సివిల్ కార్యాలయం గోడౌన్ లో ఉండవలసిన సిమెంట్ ఎలా దారి మళ్లించారు అనే అంశంపై దర్యాప్తు చేపట్టారు. అంతే కాకుండా సదర్ కాంట్రాక్టర్ చెప్పిన వివరాలను లిఖిత పూర్వకంగా రాయించుకుని తీసుకున్నారు. కాంట్రాక్టర్ కి ఎంత సిమెంట్ ఇచ్చారు ఎంత సిమెంట్ వాడాడు పని అయిన తర్వాత గోడౌన్ లో ఎంత సిమెంటు ఉండాలి తదితర అంశాలను అధికారులు విచారించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు ఎంతవరకు పాటించారు తదితర అంశాలను థర్డ్ పార్టీ టెస్ట్‌కు సిఫార్సు చేయనున్నారు. పనికోసం కేటాయించిన సిమెంట్‌లో సుమారు 50 బస్తాల వరకు తిరిగి ఇవ్వాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. దొరికిన బస్తాలతో పాటు ఇంకా మిగిలిన సిమెంట్ ఎక్కడ ఉందనే అనే అంశాలను పరిశీలిస్తున్నారు.

# ఉప్పల్ పరిధిలో కానిస్టేబుల్ ఆత్మహత్య

హైదరాబాద్, నవంబర్ 8: ఉప్పల్ పరిధిలో కానిస్టేబుల్ ఆత్మహత్య కలకలం సృష్టించింది. మల్లికార్జున నగర్ ప్రాంతంలో నివసిస్తున్న శ్రీకాంత్(42).. ఫిలింనగర్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ ఏడాది అక్టోబర్ 23వ తేదీ నుంచి విధులకు హాజరు కావడం లేదు. ఇవాళ తన ఇంట్లోనే ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శ్రీకాంత్ 2009 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్.

# కరాటే మాస్టర్ అబ్దుల్ మన్నాన్ కు గౌరవం

**-హీరో సుమన్ చేతులమీదుగా మన్నాన్ కు ఘన సన్మానం**
**-విద్యార్థులు కరాటే రాణించేలా చేస్తున్న కృషికి అభినందన**




రాజన్న సిరిసిల్ల, నవంబర్ 8:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్లజిల్లా వేములవాడకు చెందిన సీనియర్ పాత్రికేయులు,కరాటే మాస్టర్ ఎంఏ మన్నాన్ కు గౌరవం దక్కింది. ఈ సందర్భంగా కరీంనగర్ పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో నేషనల్ లెవెల్ కరాటే పోటీలు నిర్వహిస్తుండగా, ముఖ్యఅతిథిగా సినీస్టార్ సుమన్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎంతోమంది విద్యార్థులకు కరాటే నేర్పి, వారిని జాతీయస్థాయిలో రాణించేలా మన్నన్ కృషిని గుర్తిస్తూ హీరో సుమన్ చేతుల మీదుగా ఘనంగా సత్కారం చేశారు. అనంతరం హీరో సుమన్ మాట్లాడుతూ మన్నాన్‌విద్యార్థులను కరాటేలో ప్రోత్సహిస్తూ రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో, ఇంటర్నేషనల్ ప్రతిభ కనబరిచేలా చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్లు శ్రీనివాస్, ప్రవీణ్,వసంత్ కుమార్, సంపత్ కుమార్, మొండయ్య, రాజిరెడ్డి, సురభి వేణుగోపాల్, నాయుడు, పాపయ్య, నరేందర్, ప్రసన్న, లింగంపల్లి లింగయ్య, శ్రీనివాస్, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

# విశాఖపట్నం జిల్లా పెందుర్తిలో దారుణం

**-దొంగ పోలీసు ఆట ఆడుదామని చెప్పి అత్తను కుర్చీకి కట్టేసి నిప్పంటించిన కోడలు**

విశాఖపట్నం నవంబర్ 9 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); విశాఖపట్నం జిల్లాలోని పెందుర్తిలో దారుణం జరిగింది. దొంగ పోలీసు ఆట ఆడుదామని చెప్పి అత్తను కుర్చీకి కట్టేసి ఓ కోడలు నిప్పంటించింది. అత్త మరణించిన తర్వాత దీపం అంటుకుని చనిపోయిందని కుటుంబసభ్యుల తో పాటు చుట్టుపక్కల వారిని నమ్మించే ప్రయత్నం చేసింది. చివరకు పోలీసుల విచారణలో దొరికిపోయింది.వివరాల్లోకి వెళ్తే.. విశాఖపట్నం జిల్లా పెందుర్తికి చెందిన అప్పన్నపాలెంలోని వర్షిణి అపార్ట్‌మెంట్స్‌లో మహాలక్ష్మి (63) తన కొడుకు, కోడలు లలిత, మనుమరాలితో కలిసి ఉంటుంది. అయితే కొద్ది సంవత్సరాలుగా లలితతో మహాలక్ష్మికి గొడవలు జరుగుతున్నాయి. దీంతో తనను చీటికిమాటికి తిడుతుందని అత్తపై లలిత పగ పెంచుకుంది. ఈ క్రమంలోనే ఆమెను చంపి అడ్డు తొలగించుకోవాలని భావించింది. ఈ క్రమంలోనే దొంగ పోలీసు ఆట ఆడుదామని అత్తను నమ్మించింది. ఆట పేరుతో అత్త మహాలక్ష్మిని లలిత కండ్లకు గంతలు కట్టడమే కాకుండా ఆమెను కుర్చీలో తాళ్లతో కట్టేసింది. అనంతరం ఆమెపై పెట్రోలు పోసి నిప్పంటించింది. నిప్పు అంటుకున్న తర్వాత అత్త అక్కడికక్కడే మరణించింది. అత్త మరణించిందని నిర్ధారించుకున్న అగ్ని ప్రమాదం జరిగిందంటూ కేకలు వేస్తూ అందర్నీ పిలిచింది. ఇంట్లో దీపం అంటుకుని అగ్ని ప్రమాదం జరిగిందని, ఈ ప్రమాదంలో అత్త మరణించిందని సీన్ క్రియేట్ చేసి కుటుంబసభ్యులతో పాటు ఇరుగుపొరుగువారిని తప్పుదారి పట్టించింది. అంతేకాకుండా పోలీసులకు కూడా ఆమెనే సమాచారం అందించింది. వృద్ధురాలు మరణించిందనే సమాచారంతో ఘటనాస్థలికి వెళ్లిన పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్నారు. ఈ ప్రమాదంలో లలిత కూతురికి కూడా గాయాలయ్యాయి. ఘటనాస్థలిని మొత్తం పరిశీలించిన పోలీసులు.. అనుమానంతో లలిత ఫోన్‌ను చెక్ చేశారు. అందులో కీలక విషయాలు బయటపడ్డాయి. ఒక వ్యక్తిని ఎలా చంపాలి? హత్య కేసు నుంచి ఎలా తప్పించుకోవాలి? వంటి వివరాలను లలిత వెతికినట్లు గుర్తించారు. దీంతో అత్త పెట్టే వేధింపులు భరించలేక లలితనే ఈ దారుణానికి ఒడిగట్టినట్లుగా పోలీసులు నిర్ధారించారు. ఆమెను అదుపులోకి తీసుకున్నారు.

# ప్రజా ప్రభుత్వంలో ఉపాధి అవకాశాల కల్పన

**-అల్ఫోర్స్ వ్యవస్థపాకులు డాక్టర్ వి నరేందర్ రెడ్డి**
**- ఘనంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినోత్సవ వేడుకలు**

కరీంనగర్, నవంబర్8:(నేటినిజం ప్రతినిధి) :తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో అగ్రగామిగా నిలుస్తున్నదని, సంక్షేమ ఫలాలు అన్ని వర్గాల ప్రజలకు చేరుతున్నాయని అందుకు ప్రధాన కారణం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, విఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అల్ఫోర్స్ చైర్మన్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. స్థానిక తెలంగాణ చౌరస్తా వద్ద వారి ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి జన్మదినోత్సవ వేడుకలకు హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర విద్యారంగంలో సంస్కరణలకు మారుపేరు అల్ఫోర్స్ అని చాటి చెప్పారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి వైపు పయనిస్తున్నదని, వివిధ రంగాలలో చాలా ప్రశంసనీయమైన అభివృద్ధి నమోదు చేస్తున్నదని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలకు దీటుగా అన్ని రంగాలలో అగ్రగామిగా నిలపడమే కాకుండా బడుగు బలహీన వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని కొనియాడారు. వారి సామర్థ్యంలో తెలంగాణ రాష్ట్రం విద్యారంగంలో క్రీడారంగంలో పై చేయి సాధిస్తుందని, ముఖ్యంగా స్పోర్ట్స్ యూనివర్సిటీని నెలకొల్పడం చాలా గొప్ప విషయమని




చెప్పారు.అన్ని శాఖల వారిని చక్కగా సమన్వయ పరుస్తూ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసస్తూ నకాలంలోపూర్తి చేస్తున్నారని ప్రశంశించారు. ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి ఎనలేనిదని అన్నారు. యువతకు పెద్దపీట వేస్తూ, వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు. వేడుకలలో భాగంగా కేక్ ను కట్ చేసి వారి అద్వర్యంలో నిర్వహిస్తున్నటువంటి వలు కార్యక్రమాల గురించి సంక్షిప్తంగా తెలిపి అన్ని కార్యక్రమాలు తెలంగాణ రాష్ట్రంలోని చాలా చక్కగా అమలవుతున్నాయని దానికి ఎటువంటి సందేహం లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ వివిధ విభాగాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అనుసంధానంపై ఉన్న శ్రద్ధ.. పోలవరం పూర్తి చేయడంపై లేదు

**-చంద్రబాబుపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆగ్రహం**

అమరావతి నవంబర్ 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఏపీ సీఎం చంద్రబాబుపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్న బనకచర్ల, నేడు నల్లమల సాగర్.. పోలవరం లింక్ ప్రాజెక్టుకు అనుమతులు రాకున్నా.. చంద్రబాబు ఆశ మాత్రం చావలేదని అన్నారు. అనుసంధానంపై ఉన్న శ్రద్ధ.. పోలవరం పూర్తి చేయడంపై లేదని విమర్శించారు. పనికి రాని ప్రాజెక్ట్ కు ఆఖఖీల మీద నిధుల సమీకరణ మీద పెట్టే దృష్టి .. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడంపై పెట్టడం లేదని మండిప డ్డారు.పోలవరంతో పాటు 56 ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉంటే వాటిని గాలికొది లేసి లింక్ ప్రాజెక్ట్ అని పట్టుకు తిరుగుతున్నారని చంద్రబాబుపై షర్మిల మండిపడ్డారు. జలయజ్ఞానికి నిధులు లేవు కానీ.. రూ.58 వేల కోట్లతో పోలవరం ? నల్లమల సాగర్ లింక్ కడతారట అని అన్నారు. ఇది భారీ అవినీతికి స్కెచ్ కాకపోతే మరేంటి అని ప్రశ్నించారు. లింక్ ప్రాజెక్ట్ తో ఉపయోగం లేదని నిపుణులు మొత్తుకుంటున్నా.. ఆఖఖీ పేరిట హడావిడి ఎందుకు అని నిలదీశారు. పోలవరం,పెండింగ్ జలయజ్ఞం ప్రాజెక్టులపై కూటమి ప్రభుత్వాని కున్నది సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని విమర్శించారు. ఎత్తు తగ్గించి కేంద్రం అన్యాయం చేసినా నోరు మెదపనిది ఇందుకే అని అన్నారు. పోలవరం ఎత్తు 45.72 మీటర్ల నుంచి 41.15 కు కుదించి జీవనాడిలో జీవం తీశారని వైఎస్ షర్మిల విమర్శించారు. రూ.25వేల కోట్ల ఆర్ అండ్ ఆర్ మిగులు కోసం ప్రాజెక్టుని డ్యామ్ గా మార్చారని అన్నారు. 7 లక్షల ఎకరాలకు, 25 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు, 30 లక్షల మందికి తాగునీరు అందించే పోలవరం ప్రాజెక్టు స్వరూపాన్ని మార్చి ప్రశ్నార్థకం చేశారని అన్నారు.. బ్యారేజ్‌గా తప్ప బహుళార్థక సాధకంగా పనికి రాకుండా చేశారని విమర్శించారు. సర్వం కోల్పోయిన నిర్వాసితులకు పరిహారం అందించక తీరని ద్రోహం చేశారని మండిపడ్డారు. జాతీయ హోదా ప్రాజెక్టుకి కేంద్రం ఇంత అన్యాయం చేస్తుంటే, మిగులు బడ్జెట్ కోసం రాష్ట్ర ప్రయోజనాలకు సమాధి కడుతుంటే కూటమిలో పెద్దన్న పాత్ర పోషించే చంద్రబాబు నోరుమెదప కుండా లింక్ పేరుతో హంగామా చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. బాబుకు ఒఓగా పనికొచ్చేందుకే ఈ కొత్త ప్రాజెక్టు అని ఆరోపించారు.రాష్ట్రంలో జలయజ్ఞం పెండింగ్ ప్రాజెక్ట్ ల సంఖ్య 56.. ఇవ్వాల్టి అంచనాల ప్రకారం పూర్తి చేయాలం టే కావాల్సిన నిధులు రూ. 60 వేల కోట్లు.. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తే అందుబాటులోకి వచ్చే సాగునీటి లభ్యత 581 టీఎంసీలు.. సాగుబడి జరిగే అదనపు విస్తీర్ణం అక్షరాల 54 లక్షల ఎకరాలు.. గోదావరి లింక్ ప్రాజెక్టుకు పెట్టే 80 వేల కోట్ల నిధులతో జలయజ్ఞం పూర్తి చేస్తే అదనంగా 30 లక్షల ఎకరాలకు ప్రయోజనం జరుగుతుందని వైఎస్ షర్మిల తెలిపారు. ఇంత తెలిసి చంద్రబాబు పెండింగ్ ప్రాజెక్ట్ లపై కన్నెత్తి చూడటం లేదంటే.. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఎంతుందో అర్థమవుతుందని అన్నారు.

# హెల్మెట్ ధరించనందుకు.. రూ.21 లక్షల జరిమానా

లక్నో, నవంబర్ 8: ఒక వ్యక్తి స్కూటీ నడిపాడు. ట్రాఫిక్ పోలీసులు అతడ్ని ఆపారు. హెల్మెట్ ధరించనందుకు ఏకంగా రూ.21 లక్షల జరిమానా విధించారు. ఈ చలానా చూసి ఆ వ్యక్తి షాక్ అయ్యాడు. ఇది సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. నవంబర్ 4న అన్మోల్ సింఘాల్ తన స్కూటీపై బయటకు వెళ్లాడు. న్యూ మండి ప్రాంతంలో ట్రాఫిక్ పోలీసులు అతడ్ని తనిఖీ చేశారు. హెల్మెట్ ధరించనందుకు జరిమానా విధించారు.

కాగా, లక్ష ఖరీదైన స్కూటీకి రూ.20,74,000 జరిమానా విధించిన చలానా చూసి అన్మోల్ సింఘాల్ షాక్ అయ్యాడు. దీనిని సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. దీంతో ఇది వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. జరిమానాను రూ.4,000గా సవరించారు.

# బీజేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 8:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ అర్బన్ మండల భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో అనుపురం గ్రామంలోని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని నాయకులు, కార్యకర్తలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా బుర్ర శేఖర్ గౌడ్‌మాట్లాడుతూ ప్రభుత్వం దాదాపు నెల రోజులుగా వడ్ల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో ఎంతో ఇబ్బంది పడుతున్నటువంటి రైతులను పట్టించుకోకుండా జూబ్లీహిల్స్ ఎన్నికలపై దృష్టి పెట్టి నిర్లక్ష్యం వహిస్తుందని మండి పడ్డారు. నష్టపోయిన రైతులకు వెంటనే నష్ట పరిహారం చెల్లించిఆదుకువాలన్నారు. వరి ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదిక నా కొనుగోలు చేయాలని, ఎలాంటి ఆంక్షలు లేకుండా డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రైతులను ఏకం చేసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రం మహేష్ ,రాష్ట్ర నాయకులు లింగంపల్లి శంకర్, జింక అనిల్ ,కిసాన్ మోర్చా అధ్యక్షుడు గోనె భాస్కర్, మండల ప్రధాన కార్యదర్శులు చంద్రగిరి ప్రశాంత్ ,గుండెకార్ల లక్ష్మణ్,ఓబీసీ మోర్చా అధ్యక్షుడు సంతోష్ యాదవ్ ,యువ మోర్చా అధ్యక్షుడు నాంపల్లి అరవింద్, ఉపాధ్యక్షులు ఎరుగోక్కుల రమేష్, తిప్పవేణి రాజు, కార్యదర్శి సంజీవరెడ్డి, అధికార ప్రతినిధి విశ్వనాథం శ్రీధర్, నాయకులు చల్ల నర్సయ్య, చింతకుంట నరసయ్య,ఎర్రం రమేష్, ఎర్రం లక్ష్మినర్సు, పేరంగాని మల్లేశం, మర్రిపెద్ది వికాస్ కంసాని రాము , బొల్లు తిరుపతి, దామోదర్ రెడ్డి, ఊరడి రవి , బొల్లుచిన్న తిరుపతి యాదవ్, పడిగేలా మధు, రైతులు కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి ఏనుగు మనోహర్ రెడ్డి పరామర్శ



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 8:(నేటినిజం ప్రతినిధి): :వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజు పల్లెకు చెందిన వనపర్తి మహేందర్ (38) ఇటీవల మరణించగా, వారి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట మాజీ ఉప సర్పంచులు చింతలతాడేం మల్లయ్య, నల్ల సతీష్ రెడ్డి, వనపర్తి పర్శ రాములు,ఐత వెంకటేశం, నర్సయ్య గౌడ్, ఆదిత్య, అనిల్ గౌడ్, సంతోష్ తదితరులు ఉన్నారు.

# వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో 'మహాలింగార్చన'

హనుమకొండ, నవంబర్ 8:: చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో సంకటహర చతుర్థి నిత్యాన్నిహిక కార్యక్రమాలు నిర్వర్తించారు. ప్రముఖ శివభక్తుడు సతీష్‌కువర్ దంపతుల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో వెయ్యిమంది భక్తులకు కార్తీక సమారాదన దేవతా వృక్షాల దగ్గర మారేడు, జమ్మి, ఉసిరిక, రావి చెట్ల దగ్గర భక్తులు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు కార్తిక దామోదరః అంటూ అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

సాయంకాలం ఉత్తిష్టిగణపతికి పంచామృతాలతో, నవరసాలతో గణపతి అభిషేకం నిర్వర్తించి, గరికపూజ, పుష్పార్చన నీరాజన మంత్రపుష్పం అనంతరం ఆలయ నాట్య మంటపంలో 11 మంది వేదపండితుల ఆధ్వర్యంలో 'మహాలింగార్చన' పుట్టమట్టితో తయారు చేసిన 1000 శివలింగాలకు చెరుకు రసం, నెయ్యి, తేనే, చక్కెర, బిల్వఫలాలు, కొబ్బరినీళ్లు, నవరత్న జలం, పసుపునీళ్లు, నువ్వులనూనె, పుష్పోదక జలం, బిల్వజలం, రుద్రాక్ష ఉదకం, గరికవట్టివేరు, కస్తూరి పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వర్తించినట్లు ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో మహిళలందరూ దీపాలు వెలిగించుకున్నారు. వైదిక కార్యక్రమాల ఆలయ వేదపండితులు గంగు మణికంఠశర్మ, ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ, వేద పండితులు జ్యోతిభరత్‌శర్మ, ప్రసాద్‌శర్మ, రిషిశర్మ, అశ్రిత్‌శర్మ, కృష్ణశర్మ, ప్రద్యూమ్నశర్మ నిర్వహించారు. ఆలయ ఉద్యోగులు ఎన్.మధుకర్, రామకృష్ణ, రజిత భక్తులకు సేవలందించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డి.అనిల్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# ఘనంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 8:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పేదలకు పండ్లు, పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని ఆయన నాయకత్వం యువతకు ప్రేరణగా నిలుస్తోంది అన్నారు. ముఖ్యమంత్రి పై శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆశీస్సులు ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కూరగాయల కొమురయ్య, పులి రాంబాబు, చిలుక రమేష్, కోయిలకరి మస్తాన్, వంగల శ్రీనివాస్, అన్నారపు శ్రీనివాస్, ఫిర్ మొహమ్మద్, తదితరులు పాల్గొన్నారు

# మీరు భారతదేశ యువత యొక్క శక్తి మరియు స్వభావానికి ప్రతిరూపం.




పనాష్ 2025: ప్రతిభ, పరంపర మరియు పరివర్తనల నిత్యోత్సవం వేడుక సందర్భంగా డాక్టర్ జి. సతీష్ రెడ్డి మాట్లాడుతూ,"మీ అద్భుత ప్రదర్శన గణనీయమైన పురోగతితో, మీరు మరోసారి మా ఉత్సాహాన్ని రగిలించారు. మీరు భారతదేశ యువత యొక్క శక్తి మరియు స్వభావానికి ప్రతిరూపం. ఈ దేశ భవిష్యత్తు మన పిల్లల చేతుల్లో ఉంది.. వారు ముందడుగు వేసి దేశానికి కొత్త రేపటిని సృష్టిస్తున్నారు.భారత్ నేడు వేగంగా మార్పును అనుభవిస్తోంది మరియు ప్రపంచంలోని అత్యుత్తమ దేశాల సరసన తన స్థానాన్ని సంపాదిస్తోంది. ప్రచురణల సంఖ్యలో మనం ప్రపంచంలో మూడవ స్థానంలో ఉన్నాము, అలాగే పరిశోధకుల సంఖ్యలో కూడా మూడవ స్థానంలో ఉన్నాము. దేశవ్యాప్తంగా జరుగుతున్న గొప్ప పరిశోధన మరియు విద్యా కార్యకలాపాల వల్లే ఈ ర్యాంకులు మనకు లభిస్తున్నాయి.మన ఉన్నత విద్యా వ్యవస్థ ప్రతి ఏడాది మెరుగుపడుతోంది 4.38 కోట్లకు పైగా విద్యార్థులతో, 1,000కిపైగా విశ్వవిద్యాలయాలతో ఇది చాలా దేశాల జనాభా కంటే ఎక్కువ. మన విద్యాసంస్థల్లో అనేకం ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో ర్యాంక్ అవుతున్నాయి, ఇది భారత విద్యా ప్రమాణాలు పెరుగుతున్నాయనే ధృవీకరణ." మేనేజింగ్ డైరెక్టర్ సాధన సురపనేని ప్రేరణాత్మక ప్రసంగం. ఆమె సమగ్ర విద్య స్వభావ వికాసం ప్రపంచ పౌరసత్వం పట్ల పాఠశాల నిబద్ధతను ప్రతిపాదించారు. ఉప ప్రధానాచార్యులు మాధవి లత కృతజ్ఞతా ప్రసంగం జాతీయ గీతం తో కార్యక్రమం ఘనంగా ముగిసింది.



పనాష్ 2025 విద్య, సృజనాత్మకత, మరియు సమైక్యతా భావాల మహోత్సవంగా నిలిచి, సాధన ఇన్ఫినిటీ ఇంటర్నేషనల్ పాఠశాల అగ్రగామిత్వ దిశగా చేస్తున్న కృషికి ప్రతీకగా నిలిచింది. వేడుక స్వాగత గీతంతో ప్రారంభమై మధుర స్వరాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఆ తర్వాత విఘ్నేశ్వరునికి అంకితం చేసిన స్వాగత నృత్యం సంప్రదాయ సౌందర్యం ,భక్తిని ప్రతిబింబించింది. తర్వాత ప్రిన్సిపల్ శ్రీమతి సరితా కుమార్ గారు వేదికపైకి వచ్చి పాఠశాల విజయాలను వివరించారు. మేనేజింగ్ డైరెక్టర్ సాధనాదేవి సురపనేని అందుకున్న యంగ్ ఎడ్యుప్రెన్యూర్ అవార్డు పాఠశాలకు గౌరవ కారణమని తెలిపారు. ఆమె దూరదృష్టి నాయకత్వంతో పాఠశాల కేంబ్రిడ్జ్ విభాగం ఆసక్తి ఆత్మవిశ్వాసం, దయ వంటి విలువలను పెంపొందిస్తూ విజయవంతంగా ముందుకు సాగుతోందని వివరించారు.

# ఫినిషర్ రీచాకు డీఎస్పీ ఉద్యోగం.. అత్యున్నత పౌర పురస్కారం, 34 లక్షల నజరానా..!

న్యూఢిల్లీ, నవంబర్ 8:వరల్డ్ కప్ ఛాంపియన్ రీచా ఘోష్ పై వరాల జల్లు కురిసింది. భారత జట్టు విజయంలో కీలకమైన రీచాకు స్వరాష్ట్రం బెంగాల్‌లో ఘన స్వాగతంతో పాటు ఊహించని పదవి దక్కింది. శనివారం జరిగిన సన్మాన కార్యక్రమంలో వికెట్ కీపర్, బ్యాటర్‌ను డీఎస్పీగా నియమించింది బెంగాల్ ప్రభుత్వం. విశ్వ విజేతగా దేశం, రాష్ట్రం ఖ్యాతిని ఇనుమడింపజేసిన రీచాను సన్మాన వేడుకలో ఈ విషయాన్ని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వెల్లడించారు.

ప్రపంచకప్‌లో విధ్వంసక ఆటతో చెలరేగిన రీచా ఘోష్ భారత జట్టుకు నిఖార్సైన ఫినిషర్ అనిపించుకుంది. తనదైన దూకుడుతో టీమిండియా చరిత్ర సృష్టించడంలో కీలకమైన రీచాకు స్వరాష్ట్రం బెంగాల్‌లో భారీ స్వాగతం లభించింది. శుక్రవారం సొంత ప్రాంతం సిలిగురి చేరుకున్న ఆమెను శనివారం ప్రభుత్వం, బెంగాల్ క్రికెట్ సంఘం ఘనంగా సన్మానించాయి. ఈ కార్యక్రమంలోనే రీచాకు డీఎస్పీ హోదాను ఖరారు చేశారు సీఎం మమతా బెనర్జీ.

యావత్ దేశం గర్వించదగ్గ విజయంలో తనవంతు పాత్రను సమర్థంగా పోషించిన ఆమెకు రూ.34 లక్షల చెక్కును ప్రదానం చేశారు. క్యాబ్ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ, మాజీ పేసర్ ఝులాన్ గోస్వామి, ముఖ్యమంత్రి మమత చేతుల మీదుగా రీచా చెక్కును అందుకన్నారు. రాష్ట్రంలో మహిళా క్రికెటర్లకు స్ఫూర్తిగా నిలిచినందుకు రీచాకు బెంగాల్ అత్యున్నత పౌర పురస్కారమైన 'బంగా బిబుసాన్' అవార్డును ప్రకటించారు.ప్రపంచకప్‌లో ఓపెనర్లు ప్రతీకా రావల్, స్మృతి మంధానలు ఇచ్చిన శుభారంభాన్ని చివరకు భారీ స్కోర్‌గా మలచడంలో రీచా పాత్ర మరువలేనిది. ఎనిమిది ఇన్నింగ్స్‌ల్లో ఈ చిచ్చరపిడుగు 133.52 స్ట్రయిక్ రేటుతో 235 పరుగులు చేసింది.

# పోతాయిపల్లి జడ్పీ విద్యార్థుల పూర్వ విద్యార్థుల సమ్మేళనం.. 17 ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు



నిజామాబాద్, నవంబర్ 8: కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం పోతాయిపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007-08 చదివిన పూర్వ విద్యార్థులు శనివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. పాఠశాల ప్రాంగణంలో కలుసుకున్న పాత స్నేహితులు ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగక్షేమాలను ఆరా తీయడంతో పాటు ఎవరెవరు ఏం చేస్తున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆటపాటలతో రోజంతా సందడిగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పి ఉన్నతస్థాయికి ఎదగడానికి కారణమైన ఉపాధ్యాయులను సన్మానించుకున్నారు

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.